ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 13 సెప్టెంబరు 2024 | 5



కిర్లంపూడి మండలం గోనేడలో ఏలేరు వరదకు నీటమునిగి చనిపోయిన కోళ్లు

జల దిగ్బంధంలోనే..



- ఇంకా ఏలేరు వరదలోనే నానుతున్న ఇళ్లు,పొలాలు
- జలాశయానికి వరదపోటు తగ్గినా కాలువల్లో కొనసాగుతున్న ప్రవాహం
- వరదలో విలవిల్లాడుతున్న గొల్లప్రోలు,పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాలు
- ముంపు తగ్గకపోవడంతో గొల్లప్రోలులో బోటులో జనం రాకపోకలు
- పలుచోట్ల వరద నీరు వెనక్కులాగుతుండడంతో బురదలో తేలుతున్న వరిచేలు
- ఎక్కడచూసినా కుళ్లిపోయి కనిపిస్తోన్న వరి, వాణిజ్య పంటలు
- తేరుకుంటున్న రాజుపాలెం.. వరదలో మునిగిన సామగ్రిని ఆరబెడుతున్న జనం
- ఏలేరు వరద, వర్షాలకు జిల్లాలో 20 మండలాల్లో వరి, ఇతర పంటలకు నష్టం
- మొత్తం 206 గ్రామాల్లో 75 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగినట్టు అంచనా
- నష్టం రూ.180కోట్లుగా గుర్తింపు: బాధిత రైతులు 41వేల మందిపైనే
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రారంభమైన పంటనష్టం అంచనా లెక్కింపు

జిల్లాను ఏలేరు వరద కుదిపేస్తూనే ఉంది. కాలువల్లో పోటెత్తుతున్న వరద ప్రవాహం ఊళ్లకు ఊళ్లు, వేలాది ఎకరాల్లో పంటలను ఇంకా ముంచేస్తోంది. ఒకపక్క ఏలేరుకు వరద పోటు తగ్గుముఖం పట్టినా దిగువన మాత్రం వరద విలయం సృష్టిస్తూనే ఉంది. అనేక మండలాల్లో ఇంకా ముంపు పూర్తిగా తొలగలేదు. నిత్యావసర సరుకులను పడవలపై తెచ్చుకుంటున్నారు. బుధవారంతో పోల్చితే గురువారం నాటికి వరద ముంపు ప్రాంతాల్లో ప్రవాహస్థాయి కొంత తగ్గుముఖం పట్టింది. కానీ ఇంకా పీకల్లోతు ముంపు మాత్రం వీడలేదు. దీంతో వరదలోనే గ్రామాలు, పొలాలు మునిగి ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గమైతే ఏలేరు, సుద్దగడ్డ ప్రవాహాలతో అతలాకుతలమవుతోంది. గొల్లప్రోలు, పిఠాపురం మండలాలైతే వణుకుతున్నాయి. ముంపులో చిక్కుకున్న గ్రామాలు ముంపు నుంచి తేరుకోవడానికి ఇంకో మూడు రోజులు పట్టేలా ఉంది. అలాగే జిల్లావ్యాప్తంగా ఏలేరు వరద, భారీ వర్షాలకు 75 వేల ఎకరాల్లో వరి,ఇతర వాణిజ్య పంటలు దెబ్బతిన్నట్టు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. నష్టం రూ.180 కోట్లకుపైగానే ఉన్నట్టు అంచనా వేసింది.

కొత్తపల్లి మండలం రవణక్కపేటలో వరదనీటికి మునిగిన పంట పొలాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏలేరు వరద జిల్లాను అతలాకుతలం చేసింది. గతంలో వర్షాలు వచ్చినప్పుడు జలాశయం నుంచి పెద్దగా ముంపు ఉండేది కాదు. కానీ ఈసారి రిజర్వాయరుకు 47వేలకుపైగా క్యుసెక్కుల వరద పోటెత్తడంతో మొత్తం దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఏలేరు వరద విలయంలో జిల్లా చిక్కుకుంది. ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో మొత్తం 64 గ్రామాల్లోకి వరద పోటెత్తింది. ఎక్కడ చూసినా ఏలేరు కాలువలకు గండ్లు పడడంతో వరద నీరు గ్రామాలను, వేలాది ఎకరాలను ముంచేసింది. దీంతో ప్రస్తుతం ఎటుచూసినా ఏలేరు వరద ముంపులో చిక్కుకున్న వేలాది ఎకరాల పంట పొలాలు సెలయేర్లను తలపిస్తున్నాయి. అయితే ఎగువన జలాశయంలోని గురువారం ఇన్‌ఫ్లో తగ్గుతూ, పెరుగుతూ కనిపిస్తుండడంతో ఇంకా ఆందోళన కొనసాగుతోంది. మధ్యాహ్నం 12 గంటలకు 875 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో, మూడు గంటలు దాటేసరికి మళ్లీ 3,087 క్యూసెక్కులకు పెరిగి కలవరపెడుతోంది. మరోపక్క కాలువల్లో వరద కొంచెం తగ్గగా, ముంపు ప్రాంతాల్లో వరదపోటు క్రమేపీ తగ్గుతోంది. కానీ చేలు, గ్రామాలు మాత్రం ఇంకా వరదలోనే కొనసాగుతున్నాయి. ప్రధానంగా గొల్లప్రోలు పట్టణంలోని గాంధీనగర్, మార్కండేయపురం ప్రాంతాలు ముంపులో కొనసాగుతున్నాయి. ఇక్కడ వరద నీరు ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో సుద్దగడ్డ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. సూరంపేట చుట్టూ చేరిన ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు బోటులో రాకపోకలు సాగిస్తున్నారు. జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై వరద నీరు కొనసాగుతోంది. రాయవరం రోడ్డులో సత్యకృష్ణ ఫంక్షన్ హాలు నుంచి 216వ జాతీయ రహదారి వరకు రహదారిపై రెండడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. వరదనీరు పూర్తిగా తగ్గేందుకు రెండు, మూడు రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. అలాగే పిఠాపురం పట్టణంలోని ఇల్లింద్రాడ బైపాస్ జంక్షన్ నుంచి కోర్టుల వరకూ వరద ప్రవాహం గురువారం కూడా కొనసాగింది. దీంతో మధ్యాహ్నం వరకూ వాహనాల రాకపోకలను అనుమతించేదు. సాయంత్రానికి కొంత తగ్గడంతో వాహన రాకపోకలను అనుమతించారు. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్ రహదారులతోపాటు, ఈ మండలాల పరిధిలోని గ్రామాల్లో 12వేల ఎకరాల్లోని వరి, పత్తి తదితర పంటలు ముంపులోనే కొనసాగుతున్నాయి. ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లోని పంటపొలాల్లో ముంపు గురువారం మరింత పెరిగింది. గండ్లు పడిన ప్రాంతాల్లో కాలువల్లోని వరద నీరు పంటపొలాలు మీదుగా ప్రవహిస్తోంది. యు.కొత్తపల్లి శివారు మండలం కావడంతో గడచిన నాలుగు రోజులుగా పోటెత్తిన ఏలేరు వరదంతా ఇప్పుడు సముద్రాన్ని ఆనుకుని ఉన్న ఈ మండలంలోని అయిదు గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో వందలాది ఇళ్లు, పంటలు ముంపులో చిక్కుకుపోయాయి. అలాగే కిర్లంపూడిలోని రాజుపాలెం గ్రామం క్రమేపీ కోలుకుంటోంది. గండి పడ్డ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామం కావడంతో పూర్తిగా మునిగిపోగా, గురువారం నాటికి కొంతనీరు లాగింది. దీంతో ఇళ్లలోని వరద కొంచెం తగ్గడంతో బాధితులు ఇంట్లో బురదపాలైన దుస్తులు, వస్తువులు, ఎలక్ట్రికల్ వస్తువులను ఆరబెట్టుకుంటున్నారు. వీరందరికి కుటుంబానికి పదివేలు, దుస్తులు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించడంతో అధికారులు వీరికి సహాయం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వరద ముంపునకు కోళ్ల ఫారాల్లో వేలాది కోళ్ల మృతి చెంది వరదలో తేలడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నష్టం రూ.180 కోట్లుపైనే..

ఏలేరు వరద, కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో మొత్తం 75 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటమునిగినట్టు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. మొత్తం 20 మండలాల్లోని 206 గ్రామాల్లో పంటలు పూర్తిగా మునిగిపోయినట్టు గుర్తించారు. బాధిత రైతులు 40,586 మంది వరకు ఉన్నట్టు తేల్చారు. ఈ మండలాల్లో మొత్తం 85,171హెక్టార్లలో వరినాట్లు పడగా, అందులో 30 వేల హెక్టార్ల వరకు పంటలు దెబ్బతిన్నట్టు అంచనా వేశారు. పత్తి పంట ఏడు మండలాల్లోని 39 గ్రామాల్లో 625 హెక్టార్లలో నష్టపోయింది. మొత్తం వరి, వాణిజ్య పంటలకు సంబంధించి 255 గ్రామాల్లో 41,796 మంది రైతులు బాధితులుగా మారారని గుర్తించారు. మొత్తం పంటనష్టం రూ.180 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అయితే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.50 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనను అధికారులు పంపారు.





పిఠాపురం బైపాస్ రోడ్డులో 216 జాతీయ రహదారిపై పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న దృశ్యం.. గొల్లప్రోలు వైజంక్షన్ వద్ద దుకాణంలోకి చేరిన ఏలేరు వరద నీటిని తొలగించి శుభ్రం చేసుకుంటున్న నిర్వాహకులు

వరద తగ్గి.. బురద మిగిల్చింది!

హైవేపైకి చేరిన మురుగు తొలగింపు

అదే పనిలో షాపుల వాళ్లు

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు12: జాతీయ రహదారిపై వరద తగ్గి బురదను మిగిల్చింది. కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్లుతోపాటు గొల్లప్రోలు టోల్‌గేటుకు ఇరువైపు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఆరుచోట్ల రెండు రోజులపాటు ఏలేరు వరద నీరు భారీగా ప్రవహించింది. రాకపోకలు సైతం నిలిచిపోయింది. గురువారం ఉదయానికి అక్కడక్కడ స్వల్పంగా నీరు మినహా వరద తగ్గింది. వరద తగ్గిన తర్వాత జాతీయరహదారిపై పలుచోట్ల బురద పేరుకుపోయింది. పిఠాపురం బైపాస్‌రోడ్డులో సుమారు 300 మీటర్ల మేర బురద పేరుకుపోవడంతో మునిసిపల్ అధికారులు స్పందించి మినీ ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు చేపట్టారు. రోడ్డు మీదకు కొట్టుకు వచ్చిన గుర్రపుడెక్క, బురదను తొలగించి ట్రాక్టర్లతో తరలించారు. బురదతో నిండిన జాతీయరహదారిపై ప్రయాణించే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా వరద తగ్గుముఖం పట్టడంతో ముంపునకు గురైన షాపులు, దుకాణాలు, డాబాలు, టీపాయింట్లు, హోటళ్లు ఇప్పుడిప్పుడే ముంపు నుంచి బయటపడుతున్నాయి. దీంతో పిఠాపురం బైపాస్‌రోడ్డు, ఇల్లింద్రాడ, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లోని దుకాణదారులు, హోటళ్లు, డాబాల నిర్వాహకులు లోపల ఉండిపోయిన నీటిని బయటకు తోడడటంతోపాటు శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. సామగ్రి అంతా బురదమయంగా మారడంతో వాటిని బయటకు తీసుకువచ్చి శుభ్రం చేస్తున్నారు.



కాకినాడ.. ఏచూరి!

సీతారాంకి కాకినాడతో ఎంతో అనుబంధం

తల్లిదండ్రులను కలవడానికి పలుమార్లు రాక

2010లో సీపీఎం కార్యాలయం ప్రారంభానికి హాజరు


కడియంలోని జేగురుపాడులో జన్మించిన తల్లి కల్పకం



సామర్లకోటలో సీతారాం ఏచూరితో తల్లి కల్పకం (ఫైల్)

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారన్న వార్తతో సీపీఎం నేతలు, వారి కుటుంబంతో పరిచయం ఉన్న వారంతా విషాదంలో మునిగిపోయారు. సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన తల్లి ఇక్కడే నివాసం ఉండడంతో ఆయన వచ్చి వెళుతుండేవారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



ఏచూరి టవర్స్

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కాకినాడ అంటే చాలా ఇష్టం. ఆయన కుటుంబానికి కాకినాడలో ఏచూరి టవర్స్ పేరుతో ఓ అపార్ట్‌మెంట్ కూడా ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు కాకినాడలోనే ఉండేవారు. ఆయన తల్లి కల్పకం ఏచూరి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జేగురుపాడు. అయితే ఉద్యోగ రీత్యా ఆమె కాకి నాడలోనే ఉండేవారు. వారు నిర్మించుకున్న ఏచూరి టవర్‌లోనే నివాసం ఉండేవారు. సీతారాం తండ్రి కూడా తర్వాత కాకినాడలోనే ఉండేవారు. అయితే కొన్నేళ్ల కిందట వీరు మరణించారు. అయితే తల్లి కోసం పలుసార్లు సీతారాం ఏచూరి కాకినాడకు వచ్చేవారు. అదే సమయంలో జిల్లా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. 2010లో కాకినాడలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరగ్గా, సీతారాం ఏచూరి పాల్గొన్నారు. తల్లి అంటే సీతారాం ఏచూరికి ఎంతో ఇష్టం. ఎక్కడున్నా ఫోన్‌లో తల్లిని పలకరించేవారని జిల్లా పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు. సీతారాం ఏచూరి అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారని, కష్టసుఖాలు అడిగేవారని ఆయనతో పనిచేసిన పలువురు జిల్లా నేతలు గుర్తుచేసుకుంటున్నారు. అయితే తల్లి మరణానికి ముందే కాకినాడ కుళాయి చెరువు ఎదురుగా ఉన్న ఏచూరి టవర్స్‌ను విక్రయించేసినట్టు అక్కడ ఉన్న వారు పేర్కొన్నారు. ఏచూరి టవర్స్ పేరుతో ఆయన జ్ఞాపకం మిగిలే ఉంది.

సామర్లకోటలోనూ పరిచయాలు

సామర్లకోట, సెప్టెంబరు12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఏచూరి కుటుంబ సభ్యులకు సామర్లకోటతో అనుబంధం ఉంది. కంచి మహాసంస్థానం వ్యవస్థాపకులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి కుటుంబంతో సీతారాం ఏచూరి తల్లితండ్రులు సోమయాజీ ఏచూరి, కల్పకంలకు చిరకాల సాన్నిహిత్యం ఉంది. సీతారాం ఏచూరి తల్లితండ్రులు గణపతిశాస్త్రి ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అదే సమయంలో సీతారాం మేనమామ విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా కూడా తరచూ సామర్లకోటకు రాకపోకలు సాగించేవారు. అప్పుడప్పుడూ వారి వెంట సీతారాం ఏచూరి కూడా తన కుటుంబ సన్నిహితులైన గణపతిశాస్త్రి కుటుంబ సభ్యుల దగ్గరకు వచ్చేవారని చెబుతున్నారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కంచిమహా సంస్థానం నిర్వాహకులు చంద్రాభట్ల పతంజలి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సీతారాం ఏచూరి యోగక్షేమాలు తెలుసుకున్నట్టు చెప్పారు.

వైసీపీదే ఈ పాపమంతా..



- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణపై జగన్ నిర్లక్ష్యం
- టీడీపీ హయాం నుంచి జరుగుతున్న పనుల రద్దు
- గొల్లప్రోలులో నిధులు ఇస్తున్నట్టు ప్రకటన
- అధికారంలో ఉండగా ఒక్క పైసా కూడా విదల్చని వైనం
- నేడు బాధితుల పరామర్శ అంటూ రాక
- ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని టీడీపీ, జనసేన ప్రశ్న

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 12: ఏలేరు, సుద్దగడ్డ వరదల విలయంతో కాకినాడ జిల్లాలో సగానికిపైగా మండలాలు అతలాకుతలమయ్యాయి. రూ.300 కోట్లుపైగా నష్టం సంభవించింది. ఈ విపత్తు పాపమంతా వైసీపీ సర్కారుదే. టీడీపీ హయాంలో మంజూరై జరుగుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దుచేశారు. ఆధునికీకరణ జరిగి ఉంటే వరదనీరు నేరుగా సముద్రంలోకి వెళ్లిపోయేది. ఆధునికీకరణ పనులు నిలిపివేసి నాటి వైసీపీ సర్కారు చేసిన ద్రోహాన్ని తలచుకుని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ ద్వారా కాకినాడ జిల్లాలోని పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 67,500 ఎకరాలకు ఏలేరు రిజర్వాయర్ ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అదే సమయంలో పీబీసీ, పంపా ఆయకట్టుకు సాగునీటి ఎద్దడి ఏర్పడిన సమయాల్లో ఇక్కడ నుంచే సాగునీటిని మళ్లించి పంటల సాగు చేసుకునే వీలుకల్పిస్తారు. రిజర్వాయర్ నిర్మాణంతోపాటే పంటపొలాలకు సాగునీరు, ఎగువ ప్రాంతాలు నుంచి వచ్చే వరద నీరు సముద్రానికి వెళ్లేలా వరద కాలువల నిర్మాణం జరగాల్సి ఉంది. రిజర్వాయర్ ప్రారంభించి దశాబ్దాలు గడుస్తున్నా నేటికి కాలువల ఆధునికీకరణ జరగలేదు. గత 36 సంవత్సరాలకాలంలో ఏలేరు, సుద్దగడ్డ కాలువలకు 53సార్లు వరదలు సంభవించగా ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రైతులు రూ.1150 కోట్లు విలువైన పంటలను కోల్పోయారు. ఆస్తి నష్టం భారీగానే ఉంది. అధిక వర్షాల సమయంలో ముంపు సమస్య ఎదుర్కొంటుండగా వర్షాలులేని సమయంలో నీరుండక రైతులు కష్టాలు పడుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా హామీలు, ప్రకటనలకే పరిమితమైన ఏలేరు ఆధునికీకరణ పనులకు టీడీపీ పాలనలోనే మోక్షం లభించింది. అంతకుముందు పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా పనులు మాత్రం జరగలేదు. 2009 అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలలు ముందు నాటి సీఎం రాజశేఖరరెడ్డి ఏలేరు ఆధునికీకరణ పనులకు ఆయకట్టుతో సంబంధం లేని ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో శంకుస్థాపన చేశారు. పనులు జరగకపోగా నిధులు విడుదల చేయలేదు. 2014 ఎన్నికలకు ముందు ఇదే తరహాలో అప్పటి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేసిన శంకుస్థాపన శిలాఫలకాలే మిగిలాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ127.58 కోట్లతో ఏలేరు మొదటి విడత ఆధునికీకరణ పనులు చేపట్టి 55 శాతం పూర్తిచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను రద్దుచేసింది. ఏలేరు మొదటి విడతతోపాటు ఏలేరు ఆధునికీకరణ ఫేజ్-2లో భాగంగా సుద్దగడ్డ, ఏలేరు కాలువలైన నక్కలఖండి, పెదయేరు ఆధునికీకరణ చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు ఒత్తిడి తేవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.145 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ఈ పనులకు 2019 జనవరి 4న నాటి సీఎం చంద్రబాబు కాకినాడలో శంకుస్థాపన చేయగా, స్థానికంగా ప్రజాప్రతినిధులు భూమిపూజ నిర్వహించారు. పనులు ప్రారంభమైన వెంటనే ఎన్నికలు, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ సర్కారు రద్దుచేసింది. ప్రజలు, టీడీపీ నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో 2022 జూలై 28న గొల్లప్రోలులో నిర్వహించిన కాపునేస్తం సభలో ఏలేరు ఆధునికీకరణ మొదటి విడత పనుల పూర్తికి రూ.142 కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ ఫేజ్-2కు రూ.150 కోట్లు విడుదల చేస్తున్నట్టు అప్పటి సీఎం జగన్ ప్రకటించారు. జగన్ ప్రకటన తర్వాత తాజాగా మిగిలిన ఏలేరు ఫేజ్-1 పనుల పూర్తికి, సేకరించిన భూముల పరిహారానికి రూ230 కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ ఫేజ్-2కు భూసేకరణ సహా రూ.513 కోట్లు, ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.2కోట్లు, తిమ్మరాజు చెరువు ఆధునికీకరణకు రూ.7కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. రూ.750 కోట్లతో రూపొందించిన ఈ అంచనాలకు వైసీపీ హయాంలో 22నెలలకుపైగా ఎదురుచూసినా మోక్షం మాత్రం లభించలేదు. ఒకపైసా విదల్చని జగన్ నేడు ఏ ముఖం పెట్టుకుని పర్యటనకు వస్తున్నారని టీడీపీ, జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు.



పెద్దాపురం మండలం పాతపెద్దాపురంలో నీటమునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఎకరానికి పది కాదు.. రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని విమర్శ
- పెద్దాపురంలో నీట మునిగిన పంట పొలాల పరిశీలన

తగ్గుతున్న ఏలేరు వరద

మధ్యాహ్నం జలాశయంవద్ద గేట్లు మూసివేత

రాత్రికి స్వల్పంగా కాలువల్లోకి నీరు విడుదల

ఏలేశ్వరం, సెప్టెంబరు12: ఏలేరు జలాశయంలో వరదనీరు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పరీవాహక ప్రాంతం నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు భారీగా తగ్గాయి. గురువారం మధ్యాహ్నం గేట్లు కూడా మూసివేశారు. కాగా రాత్రి స్వల్పంగా మళ్లీ కాల్వలకు నీరు విడుదల చేశారు. రాత్రి 8 గంటలకు ప్రాజెక్టులో 86.56 మీటర్లకుగాను 85.75 మీటర్లు, 24.11 టీఎంసీలకుగాను 22.44 టీఎంసీలకు చేరుకోగా ఎగువ ప్రాంతం నుంచి 2801 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఏలేరుకాల్వలకు 2600 క్యూసెక్కులు, విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కలర్‌ఫుల్



గురువారం సూర్యాస్తమయ సమయంలో తూర్పు గోదావరి జిల్లా తీపర్రు వద్ద ఆకాశంలో కనిపించిన సుందర దృశ్యమిది. ఎరుపు, పుసుపు రంగుల మిశ్రమ వర్ణంతో కనిపించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

- పెరవలి



ఒకవైపు గోదావరి వరద... మరోవైపు ఆకాశంలో హరివిల్లు ఛాయ. యానాం రాజీవ్‌గాంధీ బీచ్ రోడ్డులో గురువారం సాయంత్రం 6.20 గంటలకు కనిపించింది అందమైన దృశ్యం

- యానాం

ఏఎంవీఐపై హత్యాయత్నం కేసులో నిందితుడికి

పదేళ్ల జైలు శిక్ష

అప్పట్లో సంచలనం సృష్టించిన కేసు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 12: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.విజయబాబు గురువారం రాత్రి తీర్పు చెపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలో ఏఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.చిన్నారావును 2023 మార్చి 17న స్థానిక దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న టాటాఏస్ వాహనం రికార్డును ట్యాబ్‌లో చెక్ చేస్తున్నారు. ఆ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ లేవని గుర్తించిన ఏఎంవీఐ వాహన యజమానిని రికార్డు చూపించమనగా... ఆపి ఉన్న వాహనానికి రికార్డు చూపించాల్సిన అవసరం లేదని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తి దుర్గాప్రసాద్ బొండాలు నరికే కత్తితో చిన్నారావుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం ప్రత్తిపాడులో జరిగింది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి... ప్రత్తిపాడు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న బత్తుల దుర్గాభవాని (13) సాయంత్రం హైస్కూల్ నుంచి తిరిగి వస్తూ దారిలో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన విద్యార్థిని కుటుంబీకులు, గ్రామస్తులు బావి నుంచి బాలికను బయటకు తీసి స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దుర్గాభవానిని ఉదయం మోటారు సైకిలుపై స్కూలు వద్ద వదిలిపెట్టానని, అనంతరం ఊరు వెళ్లి వచ్చేటప్పటికి తన కుమార్తె బావిలో దూకిందని మృతురాలి తండ్రి ఏసుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మరణానికి కారణాలపై విచారణ జరపాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలోకి ఆటో బోల్తా

డ్రైవరు మృతి



ఉమామహేశ్వరరావు (పాత చిత్రం)

ముమ్మిడివరం, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువు నుంచి చిప్పలపాలెం వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఆటో డ్రైవరు మృతి చెందాడు. చిప్పలపాలేనికి చెందిన రమణాతి ఉమామహేశ్వరరావు (40) గురువారం తెల్లవారుజామున మహిపాల చెరువు వెళ్లి తిరిగి వస్తుండగా బొండాయికోడు వద్ద పంట బోదెలో పడింది. దీంతో అతడు మృతి చెందాడు. ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉమామహేశ్వరరావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆటో నడపడం ద్వారా వచ్చే సొమ్ములతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్న ఒక్క ఆధారం కోల్పోవడంతో వారంతా బోరున విలపిస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నరేంద్రగిరి కొండ వద్ద వ్యాన్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... విశాఖపట్నానికి చెందిన కోర్ని శివ (29) ప్రత్తిపాడు వేగుమ్మ గుడి సమీపంలోని అక్క ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా యర్రవరం నుంచి కత్తిపూడి వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఎస్ఐ జగన్మోహన్

8,859 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, సెప్టెంబరు 12: లారీపై అక్రమంగా తరలిస్తున్న 8,859 కిలోల రేషన్ బియ్యాన్ని తొండంగి ఎస్ఐ జగన్మోహన్ గురువారం తన సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరం శివారు రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని లారీపై ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా దాడి జరిపి యాదాల శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు ఎస్ఐ జగన్మోహన్ చెప్పారు. దాడిలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వో శేఖర్, ఎంఎస్‌వో పాల్గొన్నారు.



థర్మల్ డ్రోన్‌తో శోధన

- దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుత పులి
- ట్రాప్ కెమెరాలో గుర్తింపు
- తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి భరణి వెల్లడి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 12: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం చిరుత పులి కదలిక చిత్రాలు కనిపించాయని, ప్రస్తుతం అది దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి పాదముద్రను కనుగొని పగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌లు (పీఐపీ) తీసుకున్నామన్నారు. పులి కదలికలను గుర్తించే నిమిత్తం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలను కొన్ని ప్రదేశాల్లో అమర్చామన్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని నివాస ప్రాంతాలను సిబ్బంది క్రమం తప్పకుండా శోధిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం తీసుకుని వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ప్రస్తుతం నివాస



ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ లేదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధన కూడా ప్రారంభించినట్టు తెలిపారు. చిరుతపులి కదలికల కారణంగా దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న రాజమహేంద్రవరంలోని లాలాచెరువు-హౌసింగ్ బోర్డు వద్ద నుంచి ఆటోనగర్ వరకు జాతీయ రహదారిపై వాహనచోదకులు నెమ్మదిగా ప్రయాణించాలని కోరారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయించినట్టు డీఎఫ్‌వో భరణి చెప్పారు.

ఎకరానికి పది కాదు 25వేలు పరిహారం ఇవ్వాలి

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని విమర్శ
- పెద్దాపురంలో నీట మునిగిన పంట పొలాల పరిశీలన

పెద్దాపురం, సెప్టెంబరు 12: ఏలేరు ఆధునికీకరణపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఏలేరు వరద ఉధృతి కారణంగా కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణ శివారులో నీట మునిగిన పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఎకరానికి ఎంత పెట్టుబడి పెట్టారని రైతులను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఏలేరు వరద రైతులను నిండా ముంచిందన్నారు. రైతులు ఇప్పటికే రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జగన్, చంద్రబాబు తప్పుమీది అంటే మీదని నిందలు వేసుకుంటున్నారని, పదేళ్లుగా ఆధునికీకరణపై ఇద్దరికీ పట్టింపు లేదన్నారు. జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని, డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పట్టింపులేదని, తట్టమట్టి కూడా తీసిన పాపాన పోలేదని విమర్శించారు. చంద్రబాబు ఎకరానికి రూ.10వేలు ఇస్తే సరిపోదని, రూ.25వేలు పరిహారం రైతులకు ఇవ్వాలన్నారు. జగన్ గతంలో రూ.4వేలు పరిహారం ఇచ్చి మోసం చేశారన్నారు. పర్యటనలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల దొరబాబు, మాదేపల్లి చిట్టిబాబు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, మారోతి గణేష్, నీరుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



పాత పెద్దాపురంలో వంతెన పైనుంచి ఏలేరు వరద ఉధృతిని చూస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



రైల్వే అధికారులూ ఇది సబబేనా?



ఈ ఫొటోలు చూస్తే వామ్మో.. అనిపిస్తోందా?... కింద ఉగ్ర గోదావరి, పైన ఫుట్‌పాత్ అంచున పనులు... కచ్చితంగా గుండె ఝల్లుమంటుంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ జీవులు పనిలో నిమగ్నమై వున్నారు. అడుగు తడబడితే బతుకు గోదారిలో కలిసిపోతుంది. కుటుంబం అనాథగా రోడ్డున పడుతుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు బ్రిడ్జిపై పాత సిమెంట్ రెయిలింగ్ తీసేసి కొత్తగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేసే పనులను రైల్వే బ్రిడ్జి విభాగం ఆధ్వర్యంలో చేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా గోదావరి వరద ఉధృతంగా ఉంది. ఈ నెల 11న రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేశారు. గణేశ నిమజ్జనాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కానీ ఇవేమీ రైల్వే అధికారులకు కానరాలేదు. ఇన్నాళ్లూ వదిలేసి ఇప్పుడే ముహూర్తం అన్నట్లుగా కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు చేయిస్తున్నారు. సిమెంటు రెయిలింగ్ పిల్లర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించే పనిని ఇద్దరు వ్యక్తులు చేస్తున్నారు. ఏమాత్రం ఆదమరుపుగా అడుగు ముందుకు పడినా, దిమ్మెను గోదావరిలోకి తోసే క్రమంలో తూలినా వారు జలసమాధి కావడం ఖాయం. ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వీళ్లను చూస్తూ అటుగా వెళ్లే జనం అయ్యో! అనుకుంటూ.. బడుగు జీవుల బతుకులంటే అంత చులకనా? అంటూ రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న ఉధృతి

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 12: గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు 15.30 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం 8 గంటల పాటు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి అత్యధికంగా 15,33,399 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి నీటిమట్టంలో తగ్గుదల నమోదయింది. నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం 10గంటల వ్యవధిలో 9 పాయింట్ల మేర తగ్గి సాయంత్రం 6 గంటలకు 14.50 అడుగులకు చేరుకుంది. 13,92,111 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఎగువన భద్రాచలం వద్ద నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటలకు 41.50 అడుగులుగా నమోదైంది.



హరిహర సదన్ కాటేజీపై సోలార్ ఫలకలు అమర్చుతున్న దృశ్యం

రూ.3.15 కోట్లతో సోలార్ రూఫ్ టాప్

అన్నవరం, సెప్టెంబరు 12: సత్యగిరి కొండపై ఉన్న హరిహర సదన్, శివ సదన్, విష్ణు సదన్ నిర్మాణాలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు ప్రక్రియను అన్నవరం దేవస్థానం విద్యుత్ విభాగ అధికారులు గురువారం ప్రారంభించారు. దీనికి సుమారు 3.15 కోట్లు వ్యయం కానుండగా ఏడాదికి 9వేల యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సత్యగిరిపై రెండు కాటేజీల్లో 272 గదులు, వివాహాలకు 36 హాల్స్ ఉన్నాయి. ఈ పనిని నెడ్‌క్యాప్‌కు అప్పగించనుండగా పదేళ్ల పాటు నిర్వహిస్తుంది. ఐదేళ్లలో దేవస్థానం పెట్టిన పెట్టుబడి సమకూరి అనంతరం విద్యుత్ మిగులులోకి వస్తుందని అధికారులు చెప్పారు.



పవిత్రాలతో ఆలయ అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

అంతర్వేది, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి పూజలు జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు అంకురారోపణ, అధివాసాలు నిర్వహించారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశాలు, సర్వ ప్రాయశ్చిత్తార్థం నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

నేడు మాజీ సీఎం జగన్ పర్యటన

ఏలేరు వరద ముంపు ప్రాంతాల సందర్శన

పిఠాపురం, సెప్టెంబరు 12: ఏలేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం కాకినాడ జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయల్దేరి పాత ఇసుకపల్లి మీదుగా పిఠాపురం మండలం మాధవపురం చేరుకుంటారు. 11 నుంచి 11.20 గంటల వరకు వరద బాధితులను పరామర్శించి 11.35 గంటలకి కొత్తపల్లి మండలం నాగులాపల్లి చేరుకుని వరద ప్రాంతాలను పరిశీలిస్తారు. 12.10 గంటలకు రమణక్కపేట చేరుకుని వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 12.45 గంటలకు పిఠాపురంలో హెలిపాడ్ వద్దకు చేరకుని తాడేపల్లి వెళ్తారు. జగన్ పర్యటించే ప్రాంతాలను మాజీ ఎంపీ వంగా గీత గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. పిఠాపురంలోని హెలిపాడ్, మాధవపురం అండర్‌పాస్ బ్రిడ్జి, మాధవపురం గ్రామాల్లో పర్యటించారు.



ఏలేరు.. ముంచేసింది


కొత్తపల్లి మండలం నాగులాపల్లి-రమణక్కపేట ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

- కొత్తపల్లిలో భారీగా వరదనష్టం
- 4,500 ఎకరాల్లో పంట మునక
- పిఠాపురం, గొల్లప్రోలులోను కొనసాగుతున్న ముంపు

కొత్తపల్లి, సెప్టెంబరు 12: ఏలేరు కాల్వల వరద ముంపు కారణంగా కొత్తపల్లిలో నష్టం తీవ్రంగా ఉంది. మండలంలో పాతఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, ఎండపల్లి శివారు తోటూరు, శ్రీరాంపురం, వాకతిప్ప, కొండెవరం గ్రామాల్లో 4,500 ఎకరాల్లో పంట వరద నీటిలో మునిగింది. పంట ఈనే దశలో ఉండగా వరద వల్ల రైతులు కుదేలయ్యారు. చేలు కుళ్లిపోయి పనికిరాకుండా పోతాయని వాపోతున్నారు.

కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు

వరద నీటితో ఇళ్లు మునిగిపోయిన గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయని తహసీల్దార్ జి.చిన్నారావు తెలిపారు. కొండెవరంశివారు కాశీవారిపాకలు, ఇందిరానగర్, యండపల్లి శివారు తోటూరు, కొత్త ఇసుకపల్లిలో జగనన్న కాలనీ, నాగులాపల్లి ఎస్సీపేట, పాత ఇసుకపల్లి బీసీ కాలనీ, రమణక్కపేటల్లోకి 2983మందికి పునరావాస కేంద్రాల ద్వారా భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. నాగులాపల్లి, రమణక్కపేట, ఇసుకపల్లి, అమీనాబాద్, యండపల్లిల్లో ఐదు కిలోమీటర్ల రహదారి వరదకు దెబ్బతిందని ఆర్అండ్‌బీ అధికారి తెలిపారు.

పిఠాపురం, గొల్లప్రోలులో..

గొల్లప్రోలు/పిఠాపురం, సెప్టెంబరు 12: ఏలేరు వరద తగ్గుముఖం పడుతోంది. పంటపొలాల్లో ముంపు తగ్గి నష్టాలు బయటపడుతున్నాయి. కుళ్లిపోతున్న వరిపంటను చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు. గొల్లప్రోలులోని కాలనీలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్ రోడ్లతోపాటు రెండు పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లో 12వేల ఎకరాల్లోని వరి, పత్తి తదితర పంటలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లోని పంటపొలాల్లో ముంపు గురువారం మరింత పెరిగింది. గండ్లు పడిన ప్రాంతాల్లో కాలువల్లోని వరద నీరు పంటపొలాలు మీదుగా ప్రవహిస్తోంది. పంట పూర్తిగా కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని గాంధీనగర్, మార్కండేయపురం ప్రాంతాలు ఏలేరు వరద ముంపులో కొనసాగుతున్నాయి. గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో సుద్దగడ్డ వరద నీరు ప్రవహిస్తోంది. శివాలయవన్యం కాలనీలోను ముంపు తగ్గలేదు. సూరంపేట చుట్టూ చేరిన ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు బోటులోనే రాకపోకలు సాగిస్తున్నారు. జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. గొల్లప్రోలు పట్టణంలోని రాయవరం రోడ్డులో సత్యకృష్ణ ఫంక్షన్‌హాలు నుంచి 216వ జాతీయ రహదారి వరకూ గల రోడ్డుపై రెండు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. పిఠాపురం పట్టణంలోని ఇల్లింద్రాడ బైపాస్ జంక్షన్ నుంచి కోర్టుల వరకూ ఉన్న వరద నీటి ప్రవాహం గురువారం కొనసాగింది. భారీవర్షాలు, వరదలకు చేనేత మగ్గాల గోతుల్లోకి నీరు చేరింది. వరద కారణంగా గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురం, గాంధీనగర్ సహా పలు ప్రాంతాల్లోని గృహాల్లోకి నీరు చేరింది. చేనేత కార్మికులకు చెందిన గృహాలు ముంపులో చిక్కుకున్నాయి. వందల సంఖ్యలో మగ్గాలవద్ద గోతుల్లోకి చేరింది. దీంతో వీరు రెండు వారాలుగా మగ్గం నేసే పని చేయలేకపోతున్నారు. దీనివల్ల ఇంకో 15రోజులపాటు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని చేనేత కార్మికులు వానపల్లి దుర్గారావు, రేవతి, కుమారి తెలిపారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి, వి.జగన్నాథపురం గ్రామాల్లో గురువారం పంట పొలాలు నీటిముంపులో కొనసాగుతున్నాయి. ఈ గ్రామాల్లోని వరి పొలాలు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. పెదశంకర్లపూడి, లంపకలోవ రహదారిని ఆనుకుని పంట పొలాలు ఇసుక మేటలు వేశాయి. రైతులను బీజేపీ జిల్లా నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, ఉమ్మడి వెంకటేశ్వరరావు పరామర్శించారు.

సామర్లకోటలో..

సామర్లకోట, సెప్టెంబరు 12: సామర్లకోట మండలం, పట్టణ పరిధిలో ఏలేరు మిగులు జలాలు ఉధృతి కారణంగా పంటనష్టం అంచనాలకు వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు గురువారం నుంచి సన్నద్ధమయ్యారు. సామర్లకోట మండలంలో నీటిముంపులోకి చేరిన వరిపంట చిరుపొట్ట దశలో ఉండడంతో వరిపంట కుళ్లిపోయి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రావువారి చంద్రంపాలెం గ్రామాన్ని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వ్యవసాయాధికారిణి ఐ.సత్య సందర్శించారు. ఏలేరు అదనపు జలాల విడుదల కారణంగా సామర్లకోటలో వరిపంట నీటిముంపులో ఉన్న కారణంగా 3,203 ఎకరాల్లో పంటనష్టం ఏర్పడినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు మండల వ్యవసాయాధికారిణి ఐ.సత్య వెల్లడించారు. కాకినాడ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కాకినాడ రూరల్, సామర్లకోట, పెదపూడి మండలాల్లో 5,260 ఎకరాల్లో పంటనష్టం ఏర్పడినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు కాకినాడ వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్నప్రశాంతి వెల్లడించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, సెప్టెంబరు 12: పిల్లంక పంచాయతీ కొత్తలంకలో వరదనీరు ముంచేసింది. గురువారం వరదనీరు ఇళ్ల చుట్టూ చేరడంతో బాధితులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత నీటి ట్యాంక్ వరదనీటితో మునిగిపోయి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. తహసీల్దార్ సూరిబాబు ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి తాగునీటి ట్యాంకరు కొత్తలంక పంపించారు. తహసీల్దార్, ఎంపీడీవో ఎం.అనుపమ కొత్తలంక చేరుకుని బాధితులను పరామర్శించారు.


గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలో ముంపులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గృహాలు

కిర్లంపూడిలో తేరుకుంటున్న గ్రామాలు

కిర్లంపూడి, సెప్టెంబర్ 12: ఏలేరు వరద నుంచి కిర్లంపూడి మండల గ్రామాలు తేరుకుంటున్నాయి. మూడు రోజులపాటు వరద నీటిలోనే ఇళ్లన్నీ ఉండిపోయాయి. రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, వీరవరం, శృంగరాయునిపాలెం గ్రామాలు ముంపునకు గురికావడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గురువారం నాటికి వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్లల్లోకి నీరు చేరడంతో శుభ్రపరుచుకునే పనిలో పడ్డారు. వరదలకు ఇళ్లు ముంపునకు గురై ఇంట్లో ఉన్న టీవీలు, సామాన్లు అన్నీ తడిసిపోయాయని, తమను ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని రాజుపాలేనికి చెందిన గెడ్డం సత్యవతి కోరారు. వరదకు పంటను పూర్తిస్థాయిలో నష్టపోయామని, పెట్టిన పెట్టుబడి మొత్తం పోయిందని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని భూపాలపట్నానికి చెందిన రైతు వీరంరెడ్డి నాగేశ్వరరావు కోరాడు.



వరదలకు కారణం జగన్‌రెడ్డి: మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలు/పిఠాపురం, సెప్టెంబరు 12: ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా ఇంత భారీస్థాయిలో నష్టం జరగడానికి ప్రధాన కారణం జగన్‌రెడ్డి అని, అది మరిచి వైసీపీ నేతలు సీఎం, డిప్యూటీ సీఎంలపై విమర్శలు చేయడంపట్ల మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురంలో గోతుల్లోకి నీరు చేరిన చేనేత మగ్గాలను, వరద ముంపులో ఉన్న గొల్లప్రోలు ఎస్సీ కాలనీ, మల్లవరం ఎస్సీ కాలనీ, మల్లవరం, లక్ష్మీపురం, సీతానగరం గ్రామాల్లో నీట మునిగిన పంటపొలాలును గురువారం ఆయన పరిశీలించారు. టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు, ఉలవకాయల దేవేంద్రుడు ఉన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి : బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ఏలేశ్వరం, సెప్టెంబరు 12: ఏలేశ్వరం-అప్పనపాలెం వంతెన నిర్మాణానికి కృషిచేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ అన్నారు. వరద తీవ్రతతో చెట్లు, రాళ్లు కొట్టుకు రావడంతో వంతెన బాటసారులకు వీల్లేకుండా దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, కూరాకుల రాజా, పైల అయ్యప్ప పాల్గొన్నారు.

ఇర్రిపాక ఏటిగట్లను పరిశీలించిన జగ్గంపేట ఎమ్మెల్యే



జగ్గంపేట, సెప్టెంబరు 12: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు వరద ఉధృతితో గండ్లు పడిన ప్రాంతాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, ఇరిగేషన్ ఏఈ శేషగిరిరావు, ఇరిగేషన్ డీఈ శ్రీనులతో కలిసి పరిశీలించారు. అనంతరం తిరుమలి రెగ్యులేటర్ పరిస్థితిని తనిఖీ చేశారు. ఇర్రిపాక నుంచి కిర్లంపూడి మండలం ముక్కొల్లు వరకు రక్షణ గోడలు నిర్మించాలని, పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నెహ్రూ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే తాతాజీబదిరెడ్డి అచ్చన్నదొర, మల్లిరెడ్డి సిరి, మండపాక అప్పన్నదొర పాల్గొన్నారు.

‘కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి’

కరప, సెప్టెంబరు 12: పాము కాటుకు బలైన కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు విజ్ఞప్తిచేశారు. గురువారం బా ధిత కుటుంబాన్ని వారు పరామర్శించి వారి దుస్థితిని తెలుసుకున్నారు.

నిరుపేద విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లింపు

కరప, సెప్టెంబరు 12: నిరుపేద విద్యార్థినికి కాలేజీ ఫీజు చెల్లించి తన పెద్ద మనసు చాటుకున్నాడు ఒక ఏఎస్ఐ. కరప గ్రామానికి చెందిన ముచ్చుపల్లి భాగ్యలక్ష్మి చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోక చదువు మానేద్దామని ఆమె నిర్ణయించుకుంది. దీంతో కరప పూర్వపు విద్యార్థుల సంఘం తరపున తిమ్మాపురం ఏఎస్ఐ బొల్లంరెడ్డి వీరవెంకటసత్యనారాయణ ఆమెకు కళాశాల మొదటి సంవత్సరం ఫీజు రూ.13వేలు, ఇప్పుడు రెండో ఏడాది ఫీజు మరో రూ.13వేలు చెల్లించి తన సహృదయాన్ని చాటుకున్నారు.

లయన్స్ సహకారంతో బోరు నిర్మాణం

తాళ్లరేవు, సెప్టెంబరు 12: తాళ్లరేవు పంచాయతీ జెల్లావారిపేట దివ్యాంగుడు నేరేడిమిల్లి ఏడుకొండలు అవసరాలకు ఉపయోగపడేలా తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆర్థిక సహకారంతో చేతిబోరును ఉచితంగా నిర్మించి గురువారం అతడికి లయన్స్‌క్లబ్ సభ్యులు స్వాధీనం చేశారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

కోటనందూరు, సెప్టెంబరు 12: బొద్దవరంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమంగా రవణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు కోటనందూరు ఎస్ఐ రామకృష్ణ దాడి చేసి బిళ్లనందూరుకు చెందిన ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కాలేజ్ బస్సును ఢీకొట్టిన టిప్పర్

రౌతులపూడి, సెప్టెంబరు 12: ఎస్. అగ్రహం సమీపంలో క్వారీ మేటల్ తరలిస్తున్న టిప్పర్‌ను కాలేజ్ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంతో బస్సు ముందుభాగం దెబ్బతినగా విద్యార్థులకు ప్రమాదం జరగలేదు. ఓ కళాశాలకు చెందిన విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఆగి ఉన్న బస్సును టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టినట్టు విద్యార్థులు తెలిపారు.

ఎకరానికి రూ.30 వేలు పరిహారం ఇవ్వాలి: కర్నాకుల

పెద్దాపురం, సెప్టెంబరు 12: ఏలేరు వరదల కారణంగా నీటమునిగిన పంట పొలాల రైతులకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని, బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని దివిలిలో నీటమునిగిన పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏలేరు కాలువ ఆక్రమణలకు గురైందని, ఇసుక మాఫియా వల్ల ప్రతిఏటా వరదలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి బి.రమేష్, ముసిలిబాబు, నాగేశ్వరరావు, భూషణం, వీరబాబు పాల్గొన్నారు.

‘రూ.5లక్షలను సీఎం సహాయ నిధికి విరాళంగా అందజేస్తాం’

కాకినాడ రూరల్, సెప్టెంబరు 12: రూ.5లక్షలను సీఎం వరద సహాయ నిధికి విరాళంగా త్వరలో అందజేస్తామని ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు పాలడుగు సుబ్రహ్మణ్యం అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని చల్లా కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘం సమావేశంలో కాకినాడ జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ, డాక్టర్ రామ్‌స్వరూప్‌జవహర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ 60ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ మానసిక ఉల్లాసాన్ని కలిగి ఉండడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ జవహర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ ఉద్యమం మొదలు కావాలన్నారు. కాకినాడలో ఇప్పటికే 430మంది సభ్యులు ఈసంఘంలో చేరారని పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. జి.ఆనందకుమార్, జి.సత్యనారాయణ,పి.సోమన్నచౌదరి, పవన్ భరత బజార్, నరేష్, శర్మ, అనంతలక్ష్మి, కృష్ణకుమారి,శ్రీనివాసరావు, రామనాథం పాల్గొన్నారు.

జ్ఞాన సంపద పెంపొందించే గణపతి: డాక్టర్ ఉమర్ ఆలీషా

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 12: గణాలకు అధిపతి అయిన వినాయకుడ్ని పూజిస్తే జ్ఞాన సంపద పెరుగుతుందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం రమణయ్యపేట ఏపీఎస్పీ శ్రీతిరుమల హాస్పిటల్ ప్రాంగణంలో హేరంబ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అనుగ్రహ పారాయణం చేశారు. సమస్త మానవాళి చేపట్టే ఏ శుభ కార్యకార్యానికి అయినా ఎటువంటి విఘ్నాలు లేకుండా నిర్వహించాలంటే ముందుగా గణనాథుడ్ని పూజించడం ఆనవాయితీగా వస్తూందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరీ శేఖర్, పీఠం కాకినాడ కన్వీనర్ పేరూరి సూరిబాబు, అడబాల రత్నప్రసాదరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక గర్జనకు సిద్ధం: ఆర్ఎస్ రత్నాకర్

కరప, సెప్టెంబరు 12: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు సహేతుకం కాదని, అందుకే కుట్రపూరిత ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక గర్జనకు పిలుపునిస్తున్నామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ తెలిపారు. కరప అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో గురువారం మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు గుబ్బల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాక్ మూమెంట్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని, రాక్ అనగా రేవింగ్ ఎగ్నెస్ట్ కేటగిరీ కాన్సరెసీ ఆఫ్ ఎస్సీస్ అన్నారు. అంబేడ్కర్ సేవాసంఘం స్టాండింగ్ కమిటీ సభ్యులు చిన్నం వెంకటేశ్వరరావు, నవిలే రాజేష్, మారెళ్ల వెంకటరమణ, వింత సురేష్, సాదే వీరరాఘవులు, మాతా అప్పారావు, సాదే లోహిదాస్, వజ్రపు కామేశ్వరరావు, దాలిపర్తి శ్రీనివాస్, పొట్లకాయల వీరబాబు, మేఘరాజు, రాజీవ్, రవిచంద్ర పాల్గొన్నారు.

ఉప్పలంక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక అక్రమ తరలింపు


ఉప్పలంక స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

కరప, సెప్టెంబరు 12: కరప మండలం ఉప్పలంక వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్టాక్ పాయింట్ నుంచి గురువారం ఇసుకను అక్రమంగా తరలించేశారు. ఉదయం నుంచి నిర్విరామంగా పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లపై వందల ట్రిప్పులు ఇసుకను అక్రమార్కులు దర్జాగా పట్టుకుపోయారు. అడ్డుచెప్పిన కొంతమందిపై దౌర్జన్యం చేసి ఎమ్మెల్యే అనుచరులమంటూ బరితెగించి మరీ ఇసుకను అమ్మేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకా ఒక కీలక నేత ఇసుక మేటలను తరలించేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టాక్ పాయింట్లను లీజుకు తీసుకున్న ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు మిగిలిపోయిన ఇసుక నిల్వలను అక్రమార్కులు ఏ అనుమతులు తీసుకోకుండా ట్రాక్టర్లపై తరలించి ఒక్కో ట్రిప్పు రూ.5వేల చొప్పున విక్రయించినట్లు తెలుస్తుంది. ఈ అక్రమ ఇసుక తరలింపు వ్యవహారం తెలిసి రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడకు వెళ్లి విచారణ చేపట్టారు. అధికార పార్టీ నాయకుల నుంచి వారికి ఫోన్లు రావడంతో కొద్దిసేపటికే వారు కూడా అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. దీనిపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కరప తహశీల్దార్ పిండి గోపాలకృష్ణను వివరణ కోరగా స్టాక్ పాయింట్‌కు గతంలో తన స్థలాన్ని లీజుకు ఇచ్చిన యజమాని ఇప్పుడు అక్కడ ఉన్న ఇసుకను తరలించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆర్ఐ, వీఆర్‌వోలను అక్కడకు పంపించి విచారణ చేయించామని, మైనింగ్ అధికారులకు విషయాన్ని చేరవేశామని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన వివరణ ఇచ్చారు.

ఏలేరు గండ్లు పూడ్చివేతకు సిద్ధం: ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి, సెప్టెంబర్ 12: వరద ప్రభావిత ప్రాంత ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని జరిగిన నష్టానికి పరిహారం అందజేస్తామని రాజుపాలెంలో బుధవారం సీఎం చంద్రబాబు మాట ప్రకారం గురువారం ముంపునకు గురైన బాధితులకు నిత్యావసర సరుకులు అందించామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఆర్డీవో సీతారామరావు అన్నారు. రాజుపాలెం సచివాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 46వేల క్యూసెక్కుల వరద రావడంతో తొమ్మిది గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. గండ్లు పూడ్చివేతకు రూ.25కోట్లు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరామన్నారు. వరద నీటితో బురదమయమైన ఇళ్లను ఫైర్ ఇంజన్లతో శుభ్రపరుస్తామన్నారు. పశువుల దాణాను రైతులకు అందజేశారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, పోకల దొరబాబు, బస్వా వీరబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, బొజ్జపు శ్రీను, ముక్కొల్లు సర్పంచ్ జ్యోతుల రాంబాబు ఉన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 12: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, డిప్లమా విభాగం ప్రిన్సిపాల్ వైవీఎస్ రాజశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. సీఎస్ఈ విభాగంలో ఆప్టిమైజ్‌డ్ ట్రీ బేస్డ్ ఎక్స్‌ప్లిసిట్ మల్టీకాస్ట్ ఎక్స్‌టెన్షన్ రూటింగ్ విత్ స్ట్రేటజిక్ సెక్యూర్ ప్రిసిస్ అనే అంశంపై పరిశోధన చేసి చెన్నైలోని అన్నామలై యూనివర్సిటీనుంచి డాక్టరేట్ పొందారు.

కలెక్టర్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు

సామర్లకోట, సెప్టెంబరు 12: సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురంలో ఏలేరు కాల్వవద్ద గట్టుకు గండిపడే ప్రమాదంనుంచి కాపాడేందుకు కలెక్టర్ సత్వరం స్పందించి గట్టు పునర్నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టినందుకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు గురువారం కలెక్టర్‌కు కృతజ్ఞతలు వ్యక్తం తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు, సెప్టెంబరు 12: సుంకరపాలెం బైపాస్‌సెంటరులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. కోరింగ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పంగల గ్రామానికి చెందిన పాము వెంకటరావు, పోల్నాటి మధు బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై సుంకరపాలెం బైపాస్ సెంటరుకు వస్తుండగా అమలాపురంనుంచి కాకినాడకు వెళ్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలు కాగా వారిని పోలీసులు కాకినాడ ఆస్పత్రికి తరలించారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

తాళ్లరేవు, సెప్టెంబరు 12: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా విధించారు. తాళ్లరేవు మండలం పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టువద్ద గురువారం తనిఖీలు చేస్తుండగా ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించి నమోదు చేసి కాకినాడ సెకండ్ కోర్టు మెజిస్ట్రేట్‌కు తరలించామని, మెజిస్ట్రేట్ వారు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

గండేపల్లి, సెప్టెంబర్ 12: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో భాగంగా డిపార్టుమెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వారు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ బహుమతులు ప్రదానం చేశారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

జగ్గంపేట,సెప్టెంబరు 12: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.42,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

బాధితులకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ

కిర్లంపూడి, సెప్టెంబరు 12: కిర్లంపూడి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరద బాధితులకు 3వేల బిర్యానీ ప్యాకెట్లు, మజ్జిగ ఆరు గ్రామాల్లో అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గుడాల సంధ్యారాణి, కార్యదర్శి పి.ఎస్తేరురాణి, పార్వతి, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు లోవరాజు, దేవి, సంధ్య, అఖిల్ ఉన్నారు.

పంటనష్టం లెక్కింపు ప్రారంభం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబర్ 12: వరదలవల్ల నష్టపోయిన పంటలు లెక్కింపునకు అధికార బృందాలు గురువారం క్షేత్రస్థాయిలోకి దిగాయి. జిల్లాలో 13 మండలాల్లో ప్రధానంగా వరదల వల్ల తీవ్రనష్టం జరిగింది. దీంతో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కిర్లంపూడి, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి, కాకినాడ రూరల్, పెదపూడి, తొండంగి, తుని మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో వేలాది హెక్టార్లల్లో వరి, పత్తి, మినుము, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. పది వేల నుంచి 12వేల వరకు గృహాల్లోకి వరదనీరు వెళ్లింది. పశువులు కూడా మృత్యువాత పడ్డాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బృందాలు నష్టం లెక్కింపు నమోదుకు సిద్ధమయ్యాయి. వీరు ఎక్కడైతే పంట పొలాలకు నష్టం జరిగిందో వాటి ఫోటో తీసి, రైతు పేరుతో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత ఈ సమాచారం పోర్టల్‌లో మెయిన్ సర్వర్‌కు చేరుతుంది. ఏలేరు, పంపా, తాండవ, గోదావరినుంచి వచ్చిన వరద వల్ల తీవ్రనష్టం జరిగింది. ఈ పరీవాహక ప్రాంతాల్లో 33శాతానికిపైగా నష్టం కలిగిన పంటలను ఒకఫార్మట్‌లో, 33శాతంలోపు నష్టపోయిన పంటలను మరొక ఫార్మట్‌లో నమోదు చేస్తున్నారు.

దెబ్బతిన్న గృహాలు, వ్యవసాయ, ఉద్యాన పంటల గణన ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు.

రైతులకు రుణాలు ఇవ్వాలి : కలెక్టర్

వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు రుణాల రీషెడ్యూలింగ్, కొత్త రుణాల కల్పనకు ఉదారంగా ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ బ్యాంకుల అధికారులను కోరారు. కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో గురువారం సమావేశం నిర్వహించారు.

17 నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ్ ఆంధ్రా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీవరకు చేపట్టే స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

‘ఒకే కుటుంబానికి చెందిన వాళ్లకే ఉపాధి’

కొత్తపల్లి, సెప్టెంబరు 12: ఒకే కుటుంబానికి చెందిన కూలీలకే ఉపాధి కల్పిస్తున్నారని మూలపేట గ్రామానికి చెందిన ప్రజలు, కూలీలు ఆరోపించారు. కొత్తపల్లిలో 2023-2024 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై గురువారం నిర్వహించిన సామాజిక తనిఖీలో మూలపేట గ్రామస్తులు మాట్లాడారు. సర్పంచ్ వర్గానికి చెందిన మేట్ కేవలం ఒకే కుటుంబానికి చెందిన కూలీలకు ఉపాధి కల్పిస్తూ మిగిలిన వారిని పట్టించుకోవడంలేదని పలువురు వివరించారు. మూలపేటలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించేందుకు చర్యలు చేపడతామని పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. అనంతరం సామాజిక తనిఖీ నిర్వహించారు. సంవత్సరంలో 1171 పనులకు రూ9,70,98,986కోట్ల వేతనాలు చెల్లించినట్లు తనిఖీ బృందం తెలిపింది. కూలీలకు అధికంగా చెల్లించిన రూ.46వేలను ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రికవరీ చేశారు. ఎంపీడీవో పి.వెంకటనారాయణ, ఉపాధి ఏపీడీ పి.వసంతమాధవి, ఏపీవో జి.కొండలరావు, ఎస్టీఎం గౌరీశంకర్, పీఆర్ఏఈ సింహాద్రి పాల్గొన్నారు.

వరద బాధితుల సాయం కోసం విరాళాలు సేకరణ

కొత్తపల్లి, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వాకతిప్పకు చెందిన విద్యార్థులు ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. విరాళాలను సీఎం సహాయనిధికి జమ చేస్తామని వారు తెలిపారు. గ్రామాల్లో జోలె పట్టి విరాళాలు సేకరిస్తున్న బాలుర సేవా భావాన్ని గ్రామస్తులు అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

తుని రూరల్, సెప్టెంబరు 12: డి.పోలవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, పౌష్టికాహార పంపిణీ చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, డి.పోలవరం మాజీ సర్పంచ్ పలక సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఏచూరి సీతారాం మృతికి సంతాపం

పిఠాపురం, సెప్టెంబరు 12: బడుగు, బలహీనవర్గాల పక్షాన నిలిచిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఏచూరి మృతికి సంతాపసూచకంగా పట్టణంలోని నండూరి ప్రసాదరావు భవనం వద్దగల సీపీఎం జెండాను అవనతం చేశారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నేతలు కుంచే చిన్నా, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, నాగేశ్వరరావు, చంటి, జీఎస్ భాస్కర్, స్టాలిన్, గోపాలకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం మృతికి లిబరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు బుగతాబంగార్రాజు తీవ్ర విచారం, సంతాపం వెలిబుచ్చారు. ఏచూరి మృతికి యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు పోలిశ్రీను సంతాపం తెలిపారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి మరణం బాధాకరమని సీపీఎం నేతలు విచారం వ్యక్తం చేశారు. తాళ్లరేవులో ఆ పార్టీ నేత టేకుమూడి ఈశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

యనమల దిగ్భ్రాంతి

తుని రూరల్, సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి మృతిపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటని, తెలుగుతేజం సీతారాం అంచెలంచెలుగా ఎదిగిదేశంలో రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన గొప్ప నేత అని కొనియాడారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా మలేరియా అధికారి భాస్కర్రావు

తొండంగి, సెప్టెంబరు 12: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ భాస్కర్రావు వైద్యులకు సూచించారు. గురువారం ఆయన ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుతం వర్షాలు, వరదలు జిల్లాలో విరివిగా ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటిని కట్టడి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. నీటి శాంపిళ్ల పరిశీలన, మెడికల్ క్యాంపుల నిర్వహణ చేపట్టాలన్నారు. ఇంటింటి ఫీవర్ సర్వే జరిపి వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని వైద్యులకు సూచించారు. సబ్‌యూనిట్ అధికారి డాక్టర్ మధు ఉన్నారు.